
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 సెప్టెంబర్ 2024
5
ఏలూరు




జోరువర్షంలోనూ పెన్షన్ల పంపిణీ

సాయంత్రం 6 గంటలకు 92 శాతం పూర్తి

సచివాలయ సిబ్బంది, అధికారులను అభినందించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజు శనివారం సాయంత్రం ఆరుగంటలకే 92 శాతం పూర్తయ్యింది. రెండు లక్షల 65 వేల 992 మందికి పింఛన్ సొమ్ము పంపిణీ చేయాల్సి ఉండగా సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఆగస్టు 31వ తేదీ శనివారం ఉదయం నుంచే వర్షాలు కురుస్తున్న లెక్క చేయకుండా పెన్షన్ సొమ్ము పంపిణీ సిబ్బంది పెద్దఎత్తున నిర్వహించారు. దీంతో శనివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 2,43,692 మందికి పింఛన్లు పంపిణీ చేయడం ద్వారా 91.62 పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలోని 5,104 మంది సిబ్బంది రెయిన్ కోట్లు, గొడుగులు సహాయంతో ప్రతి ఇంటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చారని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేకంగా అభినందించారు.



జీలుగుమిల్లిలో మిరప నారుమడిలో వర్షపు నీరు



నూజివీడు బస్టాండ్ లోపల వర్షపు నీరు

వర్షం.. కష్టం..!

అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షం

ఏలూరు జిల్లాలో 41.4 మిల్లీమీటర్లు, 'పశ్చిమ'లో 96.2 మిల్లీమీటర్లు సరాసరి వర్షపాతం

రెండు జిల్లాల్లో 90 శాతం నాట్లు పూర్తి

అన్నదాతకు ముంపు భయం

నూజివీడులో పెద్దచెరువుకు గండి: పరిసర ప్రాంతాలు, పంటలు మునక

జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

చెరువులకు గండ్లు, రోడ్లు జలమయం. ముంపు అంచున పంట పొలాలు, బిక్కుబిక్కుమంటూ జనం. అడుగు బయటకు పెట్టలేని పరిస్థితి. అల్పపీడన ప్రభావంతో శనివారం రెండు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అప్రమత్తమైన అధికారులు ముందుగానే స్కూళ్లకు సెలవు ప్రకటించారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. మరో రెండురోజులు ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పడంతో జనంలో భయాందోళనలు నెలకొన్నాయి.



ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో వర్షపు నీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షంతో రెండు జిల్లాల్లో జన జీవనం స్తంభించింది. పంట ముంపు భయం రైతులను వెంటాడుతోంది. శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఏలూరు జిల్లాలో 41.4 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. ముసునూరు మండలంలో అత్యధికంగా 126.4 మిల్లీమీటర్లు, లింగపాలెంలో 94.4, నూజివీడులో 88.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పశ్చిమగోదావరి జిల్లాలో సరాసరిన 96.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా పాలకొల్లులో 199.4 మిల్లీమీటర్లు, పెనుమంట్రలో 131 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఏలూరులోని పవర్‌పేటలో రోడ్లపై మోకాలి లోతు నీరు నిలిచింది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వర్షపు నీరు చేరడంతో ఎత్తిపోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండటంతో స్కూళ్లకు ముందుగానే సెలవు ప్రకటించారు. నూజివీడులో పెదచెరువుకు గండిపడి పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. 450 ఎకరాల్లో వరి పంట నీటమునిగినట్లు ప్రాథమిక అంచనాల్లో తేలింది. నూజివీడు బస్టాండ్ నీట మునిగింది. నూజివీడు-విస్సన్నపేట, నూజివీడు-హనుమాన్ జంక్షన్ రోడ్లు నీటమునిగాయి. భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. జలాశయాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, వైర్లు తెగిపడితే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో జనం ఇంటికే పరిమితమయ్యారు. ఏజెన్సీ మండలాల్లో ఇప్పటి వరకూ ఇబ్బంది లేదని చెబుతున్నారు. ఇదే విధంగా వర్షాలు కొనసాగితే గోదావరికి వరద వచ్చే ప్రమాదం ఉందని ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. జులైలో ముంచెత్తిన వరదలకు పునరావాస కేంద్రాలకు చేరిన నిర్వాసిత ప్రజలు కొద్దిరోజుల క్రితమే తమ గ్రామాలకు చేరుకున్నారు. మళ్లీ భారీ వర్షాలు కురుస్తుండటంతో తమ పరిస్థితి ఏమిటా అని ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతను వెంటాడుతున్న ముంపు భయం

ఏలూరు జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో లక్షా 90 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా ఇప్పటి వరకూ లక్షా 60 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. పశ్చిమలో 2.11 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా ఇప్పటి వరకూ లక్షా 90 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. రెండు జిల్లాల్లో దాదాపు 90 శాతం నాట్లు పూర్తికాగా, మరో పదిశాతం నారుమడుల దశలో ఉన్నాయి. జులైలో కురిసిన వర్షాలకు నాట్లు నాటిన పొలాలు, నారుమడులు మునిగి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఇప్పుడో మరోసారి భారీవర్షాలు పడుతుండటంతో పంట పొలాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంట కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేయాలని, లేకపోతే పంటపొలాల్లో వర్షపు నీరు కిందకు పారే అవకాశం లేకుండా పోతుందని రైతులు కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులను అప్రతమత్తం చేసి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకూ పంట పొలాలకు ఎటువంటి ఇబ్బందీ లేదని రెండు జిల్లాల వ్యవసాయాధికారులు తెలిపారు. ఉద్యాన పంటలకు ఇప్పటి వరకూ ఇబ్బంది లేదని ఆ శాఖాధికారులు చెబుతున్నారు.



భీమవరంలో రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు



ఆచంటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని చుట్టుముట్టిన వర్షపు నీరు

కుదుటపడుతున్న విద్యార్థుల ఆరోగ్యం

మరోసారి ట్రిపుల్ ఐటిలో తనిఖీలు నిర్వహించిన మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు ఆరోగ్యం కుదుటపడుతోంది. మంత్రి కొలుసు పార్థసారథి మరోసారి ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో శనివారం ఉదయమే తనిఖీలు నిర్వహించారు. శనివారం క్యాంపస్‌లో 48 మంది అస్వస్థతకు గురవ్వగా వారిలో 47 మంది ఓపిలో చికిత్స పొందగా ఒకరు డయేరియాతో ఇన్‌పేషెంట్‌గా చికిత్స పొందారు. అయితే సదరు విద్యార్థి కూడా కోలుకోవడంతో శనివారం సాయంత్రం డిశ్చార్జి చేశామని డాక్టర్ నరేంద్ర కృష్ణ తెలిపారు. మొత్తంగా వారం రోజుల్లో 11 వందల మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా ఎవరూ చికిత్స పొందడం లేదు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

మెస్‌ల నిర్వహణ మెరుగుపర్చాలి

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడులోని ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో మెస్‌ల నిర్వహణ మెరుగుపర్చాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నిర్లక్ష్యం వీడి విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అధికారులు, మెస్ నిర్వాహకులను మంత్రి ఆదేశించారు. శనివారం ఉదయమే ఆయన నేరుగా క్యాంపస్‌లోని మెస్ వద్దకు చేరుకుని విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు, మెస్‌ల నిర్వహణ తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నీళ్లు తాగి మరింత మెరుగైన నీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. కిచెన్‌ను పరిశీలించారు. గత రెండు రోజులకంటే పరిస్థితులు కొంత మెరుగయ్యాయన్నారు. ఇక్కడి పరిస్థితులపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. త్వరలో అన్నింటినీ ప్రక్షాళన చేసి ట్రిపుల్ ఐటీకి పూర్వ వైభవం సాధిస్తామన్నారు.

సబ్సిడీపై పామాయిల్ మొక్కల పంపిణీ

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గంలో ఈ ఏడాది రెండువేల హెక్టార్లలో పామాయిల్ తోటల సాగు లక్ష్యంగా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శనివారం నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లిలో రైతులకు సబ్సిడీపై పామాయిల్ మొక్కలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో ప్రస్తుతం 15 వేల హెక్టార్లలో పామాయిల్ సాగవుతుందని, ఈ ఏడాది మరో రెండు వేల హెక్టార్లలో సాగు విస్తరించాలని లక్ష్యంగా మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. పోతిరెడ్డిపల్లిలో ప్రస్తుతం 60 ఎకరాల్లో మాత్రమే ఈ సాగు ఉండగా ఈ ఏడాది 200 ఎకరాలకు విస్తరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పామాయిల్ సాగుకు హెక్టారుకు నాలుగు సంవత్సరాలపాటు రూ.71 వేల సబ్సిడీ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మొదటి సంవత్సరంలో మొదటిగా మొక్కల మీద రూ.29 వేలు, ఎరువుల కోసం ప్రతియేటా రూ.5,250 చొప్పున, అదేవిధంగా పామాయిల్ పంట చేతికొచ్చేవరకు అంతర పంటలు వేసుకునేందుకు నాలుగు సంవత్సరాలపాటు రూ.5,250 సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. చాప్ కట్టర్స్ కోసం రూ.50 వేలు సబ్సిడీని ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. ఆయిల్‌పామ్ తోటల్లో మైక్రో ఇరిగేషన్ వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకం కావాల్సిన రైతులు, రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి పి.రవికుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్‌భాషా, పతంజలి లిమిటెడ్ డిజిఎం వీరేంద్రచౌదరి, నూజివీడు ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ, కె.జ్యోతిప్రియాంక, పార్టీ నాయకులు కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు, అక్కినేని బెనర్జీ, అభ్యుదయ రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తమ్మిలేరు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తమ్మిలేరు పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, సంబంధిత పోలీసు సిబ్బంది కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ సూచించారు. నగరంలోని తమ్మిలేరు ప్రయాణించే మార్గాలైన అమీనాపేట వంతెన, పడమర లాకులు, తూర్పు లాకులు, వైఎస్‌ఆర్ కాలనీ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఏలూరు ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పైనుండి వర్షపునీరు అధికంగా దిగువ స్థాయికి వస్తుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన వారికి సూచించారు. ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా వారికి కావాల్సిన సదుపాయాలను చూసేందుకు కూడా పోలీసు శాఖ సమర్థంగా ఉండాలని ఆయన సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను తనకు తెలియజేయాలన్నారు.



తమ్మిలేరును పరిశీలిస్తున్న ఎస్‌పి

కుక్కునూరులో కంట్రోల్ రూం ఏర్పాటు

కుక్కునూరు : భారీ వర్షాల నేపథ్యంలో కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ వి.పెద్దిరాజు తెలిపారు. మూడు షిఫ్టుల్లో పని చేసేలా సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ప్రజలు వారి ప్రాంతాల్లో భారీ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఎడతెరిపి లేని వర్షం... జనజీవనం అస్తవ్యస్తం

నీట మునిగిన ఏలూరు నగరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏలూరు నగరం మొత్తం నీట మునిగింది. నగరంలో ఏ రోడ్డు చూసినా ఏది రోడ్డు, ఏది డ్రెయినేజీ తెలియని పరిస్థితిలో రెండు ఏకమై ఏరులా ప్రవహిస్తున్నాయి. నగరంలోని ఆర్ఆర్.పేట, పవర్‌పేట, కొత్తపేట, తంగెళ్లమూడి, అమీనా పేట, అశోక నగర్, పత్తేబాద, వన్ టౌన్ లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో వాహనదారులు రోడ్డుపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా ఇంచుమించు నగరంలోని అన్ని చోట్ల రోడ్లు, డ్రెయినేజీలు ఏకమై మురుగునీరు వర్షపు నీటితో కలిసిపోయి రోడ్లపై ప్రవహిస్తూ ఉండటంతో ప్రజలు నడిచి వెళ్లేందుకు కూడా తీవ్ర అవస్థలు పడ్డారు. అలాగే జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలోకి నీరు చేరడంతో బకెట్లతో తోడి బయట పోయాల్సి వచ్చింది. డిఇఒ, రిజిస్ట్రేషన్, వ్యవసాయ శాఖ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లోకి నీరు చేరింది. జిల్లాలో పాఠశాలలకు ఆలస్యంగా సెలవు ప్రకటించడంతో చాలామంది పాఠశాలలకు వెళ్లిపోయి, తిరిగి వచ్చేందుకు వర్షంలో నానా ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు ఇంటికే పరిమితమయ్యారు. పత్తేబాద రైతు బజార్‌లో మోకాళ్ల లోతు నీరు చేరడంతో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యాపారులు కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. నగరంలో ఎక్కడ చూసినా కొత్త కొత్త భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం వల్ల డ్రెయినేజీపై ర్యాంపులు ఏర్పాటు చేసుకుని డ్రెయినేజీలు పూర్తిగా మూసివేయయడంతో సిల్ట్ తీసే అవకాశం లేక మురుగనీరు పారుదల మందగించింది. దీంతో వర్షపు నీరు త్వరగా డ్రెయినేజీలోకి, అక్కడి నుంచి ఊరి బయటకు వెళ్లే అవకాశం లేక నగరంలో కొద్దిపాటి వర్షం వచ్చినా మురుగునీరు రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఉంది.



ఏలూరులో పత్తేబాద రైతుబజార్‌లో వర్షపు నీరు

జలదిగ్బంధనంలో నూజివీడు


నూజివీడు టౌన్ : నూజివీడులో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నూజివీడు పెద్ద చెరువుకు గండిపడింది. పరిసర ప్రాంత ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని తాళ్ల సాయంతో సురక్షిత ప్రాంతానికి వెళ్లారు. నూజివీడు-విస్సన్నపేట రహదారిలో కిలోమీటర్ మేర నీరు ప్రవహిస్తుంది. నూజివీడు బైపాస్ రోడ్డుపై కిలోమీటర్ల మేర వరద నీరు ప్రవహిస్తుంది. ఈ వరద నీరు ప్రవాహంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ పరిశీలించారు. ఆయన ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. వరద ప్రవాహానికి నూజివీడు బైపాస్ రోడ్డులో కోళ్ల మేతతో వెళ్తున్న కాలువలోకి కొట్టుకుపోయింది. అక్కడే ఉన్న స్థానికులు లారీ డ్రైవర్‌ని రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. నూజివీడు ఆర్‌టిసి బస్టాండ్‌లో మోకాలు లోతు నీరు చేరింది. వరదల్లో చిక్కుకున్న ఒక వృద్ధుడిని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ రక్షించారు.

ముదినేపల్లి అతలాకుతలం

ముదినేపల్లి : భారీ వర్షం ముదినేపల్లి మండలాన్ని కుమ్మేసింది. రికార్డ్ స్థాయిలో కురిసిన వర్షంతో ముదినేపల్లి మండలం అతలాకుతలమైంది. రెండు రోజులుగా కురుస్తున్న కుంభవృష్టితో ప్రధాన రహదారులు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు మోకాళ్ల లోతు నీటితో నిండిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. పల్లపు ప్రాంతాల్లోని నివాసాల్లోకి, లోతట్టు కాలనీలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ముదినేపల్లి అంబేద్కర్ నగర్‌లో ఇంటి గోడ కూలింది. గతంలో ఎన్నడూ కురువని విధంగా జిల్లాలో రికార్డు స్థాయిలో 17 సెంటీమీటర వర్షపాతం నమోదు కావడంతో మండల వ్యాప్తంగా ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించే వీలు లేకుండా రోడ్లపై భారీ ఎత్తున నీరు చేరింది. దీంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. కూలీలు, కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలోని వణుదుర్రు వద్ద బిఎండి ఛానల్‌కు గండి పడింది. దీంతో 200 ఎకరాల వరి పైరు ముంపు బారిన పడ్డాయి. దీంతో రెవెన్యూ అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చివేశారు. భారీ గాలులకు మండలంలోని పెద గొన్నూరులో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు 20కి పైగా నేలకొరిగాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని మేజర్, మైనర్ డ్రెయిన్లు, ప్రధాన పంట కాలవలు ప్రమాద స్థాయికి చేరి ప్రవహిస్తున్నాయి. డ్రెయిన్లు పొంగి ప్రవహించటంతో పంట పొలాలు నీట మునిగాయి. గతంలో ఇంత భారీ వర్షం చూడలేదని జనం చెబుతున్నారు. డ్రెయిన్లు పూడికిపోవడం, పోల్ రాజ్ మురుగు కాలువ ఎదురుతన్నడంతో వర్షపు నీరు ఇంకాను నివాసాల ప్రాంతాల్లో రోడ్లపై భారీగా నిలిచి ఉంది.



ముదినేపల్లిలో బిఎండి ఛానల్‌కు పడిన గండి



నూజివీడులో రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పొగాకు, మిరప నారు మడుల్లో వర్షపు నీరు

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకల గుండా వరద నీరు వచ్చి చేరుతోంది. పలుచోట్ల వేసిన పొగాకు, మిరప నారు మడుల్లోకి నీరు వచ్చి చేరడంతో నీట మునిగాయి. వాయుగుండం ప్రభావంతో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో పొగాకు, మిరప నారు మడులు దెబ్బతింటాయని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

ముసునూరు : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండల పరిధిలోని ముసునూరు, చెక్కపల్లి, కాట్రేనిపాడు, లోపూడి, ఎల్లాపురం, బలివే, చిల్లబోయినపల్లి, వెంకటాపురం, కోర్లగుంట, బాసవరపాడు గ్రామాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదేళ్ల క్రితం ఏస్థాయిలో కురిసిందో మళ్లీ ఆ స్థాయిలో వర్షం కురిసిందని వయసు పైబడినవారు చెబుతున్నారు. వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. గ్రామాల్లో అంతర్గత రోడ్లు జలమయంఅయ్యాయి. కొన్ని గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



ముసునూరులో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

నీట మునిగిన పంట పొలాలు


కొయ్యలగూడెం : మండలంలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. ప్రభుత్వ, ప్రయివేట్ స్కూల్స్‌కు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఉదయం నుంచి ఏక బిగువున వర్షం కురవడంతో, పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో 1, 2 మేజర్ పంచాయతీలు మినహా ఎక్కడా సరైన రోడ్డు సౌకర్యం లేదు. ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా వారు స్పందించకపోవడంతో ఆ గతుకుల రోడ్లలోనే ప్రజలు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉధృతంగా పొంగి పొర్లుతున్న వాగులు

ఆగిరిపల్లి : అల్పపీడనం ప్రభావంతో ఆగిరిపల్లి మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వాగులు ఉధృతంగా పొంగి పొర్లడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. వాగు వరద ఉధృతికి నూగొండపల్లి-ఆగిరిపల్లి, తోటపల్లి-ఆగిరిపల్లి, శోభనాపురం-ఆగిరిపల్లికి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. తహాశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయటంతో పాటు తహాశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ పర్యవేక్షణలో రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది వరద ప్రభావిత గ్రామాల్లో రక్షణ చర్యలు చేపట్టారు.

కుండపోత వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

మండవల్లి : మండవల్లి మండలంలో విస్తారమైన వర్షం కురిసింది. గురువారం సాయంత్రం మెఘావత్తమై ప్రారంభమైన వర్షం శనివారం మధ్యాహ్నం వరకు కుండపోతగా కురిసింది. మండలంలోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు, చెరువులను తలపించాయి. మండవల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కైకలూరు సందు ఎస్‌సి, బిసి కాలనీల్లోని రహదారులు పూర్తిస్థాయిలో నీట మునిగాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు నిర్వహించడంతో వర్షపు నీరు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో జాతీయ రహదారిపైకి వర్షపు నీటిలో మరుగునీరు కలిసి చేరింది. జాతీయ రహదారిపై మండవల్లి వద్ద రహదారి నిర్మించకపోవడంతో ఏర్పడిన పెద్దపెద్ద గోతుల్లోకి వర్షపు నీరు చేరుకుని గుంతలు కనిపించక వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. రహదారులపై జనజీవనం పూర్తిస్థాయిలో స్తంభించింది. రొయ్యలు, చేపల చెరువుల్లో వర్షపు నీరు చేరడంతో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి రొయ్యలు మృత్యువాత పడతాయేమోనని, చేపల చెరువుల్లో నీరు అధికంగా చేరడంతో గట్లు తెగిపోయే పరిస్థితి ఉందని రైతులు భయాందోళన చెందుతున్నారు.



మండవల్లిలో జాతీయ రహదారిపై వర్షపు నీరు

పోటెత్తిన ఉప్పుటేరు

కలిదిండి : ఎడతెరపి లేని వర్షంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండ్ ప్రాంతంలోని రహదారులపైకి వర్షపు నీటితో పాటు డ్రెయినేజీ నీరు కలిసి నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు పలు ఇక్కట్లకు గురయ్యారు. ఈద్గా సమీపంలోని చెరువు పక్కన ఇళ్లు, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శాఖా గ్రంథాలయం చుట్టూ నీరు చేరింది. పిహెచ్‌సికి వెళ్లే రోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఉప్పుటేరు పోటెత్తడంతో లాల్వా మురుగు కాలువలో పారుదల నెమ్మదించడంతో, దానికి అనుసంధానమైన డ్రెయినేజీ నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. పడమటిపాలెం పంచాయతీ పరిధిలోని బంకు కాలనీలోని సుమారు 40 ఇళ్లు నీటిలో చిక్కుకున్నాయి.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఉద్దేశించిన వ్యవసాయ విస్తరణ కార్యక్రమం పొలం పిలుస్తోంది అనిరాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ మూడో తేదీ నుంచి చేపట్టనున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం కింద ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయి సాంకేతిక సమాచారం, డిపార్ట్‌మెంట్ ద్వారా అమలు చేసే ప్రభుత్వ పథకాల గురించి రైతులకు తెలియజేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. తప్పనిసరిగా ఆ రెండు రోజుల్లో నాలుగు గ్రామాలను సందర్శించి రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, నూజివీడు వ్యవసాయాధికారి ఎ.నాముదేశ్వరి, చాట్రాయి వ్యవసాయాధికారి బి.శివశంకర్, ఆగిరిపల్లి వ్యవసాయాధికారి పి.చెన్నారావు, ముసునూరు వ్యవసాయాధికారి మధుమోహన్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి

జీలుగుమిల్లి : మండలంలోని బర్రింకలపాడులోని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు నివాసం వద్ద పొలం పిలుస్తోంది పోస్టర్లను ఎంఎల్ఎ చేతులమీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పిజి.బుజ్జిబాబు మాట్లాడుతూ సెప్టెంబర్ మూడో తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మంగళ, బుధవారాల్లో వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు ఆయా గ్రామాలను సందర్శించి వ్యవసాయానికి సంబంధించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటి వద్దే రేషన్ సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నిత్యావసర సరుకులు (రేషన్) ఎప్పటిలాగే ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి పదో తేదీ లోపల లబ్ధిదారులకు ఇంటివద్దే పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌కెఎన్.ఖాజావలి తెలిపారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి రేషన్ పంపిణీ సక్రమంగా చేసేందుకు సంబంధిత యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సివిల్ సప్లై డిటీలు పర్యవేక్షిస్తారని తెలిపారు.

కొత్తపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని కొవ్వలి గ్రామం కొత్తపేటలో జ్వరాలు విజృంభించడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కొత్తపేట ఏరియాలో 60 నుంచి 70 మంది జ్వరాలతో బాధపడుతున్నారని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి రావడంతో వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ శర్మిష్టతో కలిసి పరిశీలించారు. ఎంఎల్ఎను గ్రామస్తులు కలుసుకుని సమస్యలు వివరించారు. ఇక్కడ విష జ్వరాలు అధికంగా రావడానికి బోరు నీరు కారణమని చెప్పారు. గతంలో చెరువు నీరు తాగేవారమని, ఇప్పుడు ఆ చెరువు పాడవడంతో నీరు అందించడం లేదని వివరించారు. వెంటనే చెరువు బాగుచేయించాలని కోరారు. సదరు విషయమై వెంటనే స్పందించిన ఎంఎల్ఎ చెరువును పరిశీలించి వెంటనే బాగు చేయడానికి ఆదేశాలు జారీ చేశారు. వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి బోరు నీరు కాకుండా ప్రత్యామ్నాయంగా కాలువ నీటిని ఏర్పాటు చేశారు. అనంతరం కొత్తపేట ఏరియా మొత్తం తిరిగి అక్కడ ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను రెండు రోజుల లోపు సరిదిద్దాలని, చుట్టూ ఉన్న చెత్తాచెదారం రెండు రోజుల్లో తీయించాలని పంచాయితీ వారిని ఆదేశించారు.


గోతులమయంగా ఉన్న రోడ్డు

గుంతలు పూడ్చరూ..!

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రమాదకరంగా ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని యర్రగుంటపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు యర్రగుంటపల్లిలోని మెయిన్‌సెంటర్‌లో గోతుల్లో వర్షపు నీర చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముత్తారెడ్డికి తహశీల్దార్ పరామర్శ

ప్రజాశక్తి - చింతలపూడి

ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న టిడిపి చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డిని తహశీల్దార్ ప్రమాద్వర పరామర్శించారు. ముత్తారెడ్డిని యర్రంపల్లి ఆయన స్వగృహంలో తమశీల్దార్ శనివారం కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజల్లో వచ్చి సేవ చేయాలని కోరారు. తహశీల్దార్‌తో పాటు డిప్యూటీ తహశీల్దార్, సిబ్బంది ఉన్నారు.

పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలను జనసేన ఉభయగోదావరి జిల్లాల అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఐదో రోజు స్థానిక 18వ డివిజన్ వంగాయగూడెంలో ఆర్‌సిఎం చర్చి పక్కన ఉన్న మదర్ థెరిస్సా ఓల్డేజ్ హోమ్‌లో ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి, స్థానిక డివిజన్ ఇన్‌ఛార్జి పల్లి విజయ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెడ్డి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డిఅప్పలనాయుడు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా నిత్యం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం అనేక ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు, మొక్కల పంపిణీ కార్యక్రమాలు, రెండో తేదీ ఏలూరు నియోజకవర్గం అంతా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, బాలు, లావేటి రమణ, 18వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మెగా అభిమానులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.నవీన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చింతల వాగు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సొసైటీ సమీపంలో పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మలమల..సలసల..!



వారంతా భావి భారత పౌరులు.. విజ్ఞాన సముపార్జనే లక్ష్యంగా అక్కడకు చేరుకున్నారు.. అయితే అన్నార్తుల్లా ఆకలి మంటలతో మలమల్లాడుతూ, మరోపక్క అపరిశుభ్ర వాతావరణం.. కలుషిత ఆహారంతో అనారోగ్యం పాలై విలవిల్లాడుతున్నారు. ఇదీ రెండు జిల్లాల్లో ప్రతిష్టాత్మకమైన నూజివీడు ట్రిపుల్ ఐటితోపాటు పలు విద్యాసంస్థలు, హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితి. అదే సమయంలో జిల్లావ్యాప్తంగా పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అన్నిచోట్లా జనం జ్వరాలతో మూలుగుతున్నారు. ఆసుపత్రులకు వెళ్లినా సలసలలాడే జ్వరం తగ్గక తల్లడిల్లుతున్నారు. ఇదే సమయంలో డెంగీ మరణాలు జనాలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

రెండు జిల్లాల్లో గ్రామీణ, పట్టణప్రాంతాల్లో రోగాలు విజృంభిస్తున్నాయి. జ్వరం, జలుబు, వాంతులు, విరేచనాలు, కీళ్లనొప్పులు వంటి సమస్యలతో జనం ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. చికిత్స పొందినా వీటి ప్రభావం కనీసం వారం నుంచి పది రోజులకుపైనే ఉంటోంది. దీంతో ఆరోగ్య, ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. డెంగీ కేసులు అధికారికంగా నమోదు చేయడానికి, చూపడానికి వైద్యారోగ్య శాఖాధికారులు ఇష్టపడటం లేదు. దీంతో జనం సమీప పట్టణాల్లోని ప్రయివేటు ఆస్పత్రులకే వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఏజెన్సీ, మెట్ట, డెల్టా ప్రాంతాల్లో డెంగీ మరణాలు చోటుచేసుకోవడం అందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం మాత్రం జ్వరాల అదుపునకు చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నా ఆచరణలో అటువంటి దాఖలాలేవీ కానరావడం లేదు. పైగా అపారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం తదితర సమస్యలు జనాలను పట్టిపీడిస్తున్నాయి. తక్షణం ప్రభుత్వం రెండు జిల్లాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి గ్రామీణప్రాంతాల్లో విరివిగా వైద్యశిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి రోగాలబారిన పడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడితే పరిస్థితి ఎంతోకొంత మెరుగుపడే అవకాశం ఉంది. అలాకాకుండా గత ప్రభుత్వ వైఫల్య ఫలితమేనని విమర్శలు చేస్తూ కూర్చుంటే గత పాలకులకు, ప్రస్తుత పాలకులకు తేడా లేకుండా పోతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక నూజివీడు ట్రిపుల్ ఐటిలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర ప్రజారోగ్య శాఖాధికారులు పర్యటించి హెచ్చరించినా మెస్‌ల నిర్వహణలో మార్పు రాకపోవడం వ్యవస్థీకృతంగా పేరుకుపోయిన నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. అన్నివైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ సెలవుపై వెళ్లిపోయారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి శుక్రవారం రాత్రి వరకూ ట్రిపుల్‌ఐటి ప్రాంగణంలో ప్రత్యక్ష చర్యలకు దిగడం విద్యార్థులకు కొంత ఉపశమనాన్నిచ్చింది. కార్యాచరణలో రానున్న రోజుల్లో మెస్‌ల నిర్వహణ మెరుగ్గా సాగితే విద్యార్థులకు అర్థాకలి, అనారోగ్యం దూరమవుతాయి. అలాగే జిల్లాలోని అన్ని గురుకుల, ఆశ్రమ పాఠశాలలతోపాటు హాస్టళ్లన్నిం టిలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై తక్షణం హెల్త్ చెకప్‌లు నిర్వహించాలి. అవసరమైన మందులు అన్ని వైద్య ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర నెలలు దాటింది. గత వైసిపి ప్రభుత్వంలో వివిధ పదవులు చేపట్టిన వారు పక్కచూపులు చూస్తున్నారు. వైసిపి అధినా యకత్వంపై అపనమ్మకమో.. లేక తమ పదవీకాలంలో చేపట్టిన పనులపై ఎటువంటి చర్యలుంటాయోననే ఆందోళనో చాలామంది నేతలు మౌనంగా ఉంటున్నారు. మరికొందరైతే అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ డిప్యూటీ సిఎం ఆళ్ల నాని, ఏలూరు మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, వైసిపి ఏలూరు నగరాధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఇడా ఛైర్‌పర్సన్ బొద్దాని అఖిల, మాజీ ఎఎంసి ఛైర్మన్ మంచెం మైబాబు తదితరులు వైసిపికి గుడ్‌బై చెప్పారు. ఆపై నాని తప్ప మిగిలిన వారంతా నారా లోకేష్ సమక్షంలో టిడిపి గూటికి చేరారు. మరి నాని రూటెటో వేచిచూడాలి. ఇదేరీతిన రెండు జిల్లాల్లో కొంతమంది వైసిపి నేతలు పక్కచూపులు చూస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ముఖ్య నేతలెవ్వరూ పార్టీ దిగువ శ్రేణుల నేతల్లో ఆత్మస్థైర్యం నింపే పని చేయకపోవడంతో ఆ పార్టీ మండలస్థాయి నేతలు, కార్యకర్తలు సైతం తీవ్ర గందరగోళంలో ఉన్నారు. పాలకొల్లు మినహా మిగతా ఎక్కడా వైసిపి నేతలు యాక్టివ్‌గా కన్పించడం లేదు. ఎంఎల్‌సిలు రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ సైతం అప్పుడప్పుడు అధికారిక సమావేశాల వంటి వాటిలోనే కన్పిస్తున్నారు. మొత్తానికి గత ఎన్నికల ముందు వరకూ సందడి చేసిన వైసిపి అధికారం కోల్పోయాక పూర్తిగా నిస్తేజమైపోయిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

వివిఎస్‌వి.ప్రసాద్

విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో ముందుకెళ్లాలి

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కె.లెనిన్, జి.సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థులకు, యువజనులు శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు వెళ్లాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కె.లెనిన్, జి.సూర్యకిరణ్ అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.లెనిన్, జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ దేశంలో మూఢత్వం బాగా పెరిగిపోయిందన్నారు. ఉన్నత చదువులు చదివిన వ్యక్తులు కూడా మూఢత్వంలో మునిగిపోయి ఉన్నారన్నారు. విద్యార్థి దశ నుంచి పాఠ్య పుస్తకాల్లో మత ప్రచారణ జరుగుతుందని, మరోపక్క యూనివర్సిటీలో పూజలు ఎలా చేయాలి జాతకాలు ఎలా చూడాలనే కొత్త కోర్సులు తీసుకొస్తామని ప్రభుత్వ పెద్దలు అనడం సిగ్గు చేటన్నారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరుగిపోతుందన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రతి కుటుంబంపై ఆర్థిక భారం పడుతుందని ప్రభుత్వం ఇవి ఏమీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దేశంలో జిడిపిలో 16 శాతం విద్యారంగానికి కేటాయించకుండా కేవలం మూడు నాలుగు శాతం మాత్రమే కేటాయిస్తున్నారని, దీంతో ప్రయివేట్ యూనివర్సిటీలు హల్‌చల్ చేస్తున్నాయన్నారు. మరికొన్ని గుర్తింపు లేని యూనివర్సిటీ నడుస్తున్నా ప్రభుత్వం విద్యారంగం వైపు చిన్నచూపు చూస్తుందన్నారు. విద్యార్థి సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ శిక్షణా తరగతుల్లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు జయంత్, మనోజ్, పోతురాజు, సీతారాములు, వెంకట సుబ్బారావు, అర్జున్, నరసారావు పాల్గొన్నారు.

లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించండి : సిపిఎం

కుక్కునూరు : విద్యుత్ సరఫరా ఇబ్బందులు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కుక్కునూరు మండలంలో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కుక్కునూరు గణేష్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ అయ్యి నెలరోజులు కావొస్తున్నా ఇప్పటివరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయలేదన్నారు. రామాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కి కలపడంతో కుక్కునూరు ఎ బ్లాక్‌లో తీవ్రమైన లో ఓల్టేజ్ సమస్య ఏర్పడిందని తెలిపారు. లైట్లు, ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు, టివిలు పనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను కుక్కునూరు ఎఇ మోహన్‌పాపారావు దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. సమస్య మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఎఇ మోహన్‌పాపారావుపై తగు చర్యలు తీసుకుని మండలంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆత్మవిశ్వాసమే ఆమె ఆయుధం

అంగన్వాడీ నుంచి సిడిపిఒ పీఠం వరకు ఎదిగిన నాగ స్వర్ణకుమారి
నేడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం



విశ్వాసం అనేది కంటికి కనిపించని అద్భుతమైన శక్తి. అది ఉన్నవారికి అసాధ్యం అంటూ ఏదీ లేదు. అంగన్‌వాడీ వర్క ర్‌గా మొదలైన స్వర్ణకు మారి సిడిపిఒ స్థాయికి ఎదిగింది. 28 ఏళ్ల సుదీర్ఘ ప్రభుత్వ సేవ అనంతరం ఈ నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రి జీపు డ్రైవర్ కన్నయ్యానాయుడు, పార్వతి దంపతుల పెద్ద కుమార్తె స్వర్ణకుమారి. డిగ్రీ బిఎ పూర్తి చేసిన స్వర్ణకుమారి ఆత్మవిశ్వాసంతో అంగన్వాడీ వర్కర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు.

అంచెలంచెలుగా ఎదుగుదల

13 ఏళ్ల పాటు అంగన్వాడీ కార్యకర్తగా పని చేసిన అనంతరం 1996లో తూర్పుగోదావరి జిల్లా శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్టులో గ్రేడ్-2 సూపర్‌వైజర్‌గా ఉదోగోన్నతి పొందారు. శంఖవరం, బుట్టాయగూడెం, నల్లజర్ల, వేలేరుపాడు, గోపాలపురం ప్రాజెక్టుల్లో వివిధ హోదాల్లో సేవలందించారు. గిరిజన ప్రాంతాల్లో పిల్లల పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, అనేక విజయాలు సాధించారు.

సిడిపిఒగా స్వగ్రామంలో సేవలు

2021 డిసెంబర్‌లో సిడిపిఒగా ఉద్యోగోన్నతి పొందారు. నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామంలో పుట్టిన తన తండ్రి పనిచేసిన ప్రాంతంలోనే తాను పెరిగిన కొయ్యలగూడెంలో సిడిపిఒగా బాధ్యతలు చేపట్టడం తన జీవితంలో మరపురాని అనుభవమని ఆమె అంటారు.బస్వర్ణకుమారి భర్త ప్రభుత్వ ఉపాధ్యాయుడు. వీరి కుమార్తె ఎంఎస్‌సి పూర్తి చేసింది. అల్లుడు బ్యాంక్‌లో రీజనల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. కుమారుడు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు.

వంగా నాగేశ్వరరావు సేవలు అభినందనీయం

ఉద్యోగ విరమణ సభలో వక్తలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలతో పాటు, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన కళాశాల ప్రధానాచార్యులు వంగా నాగేశ్వరరావు సేవలు అభినందనీయమని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు బొమ్ము రవికుమార్ అన్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో భీమడోలు కేంద్రంగా శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో తెలుగు ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన వంగా నాగేశ్వరరావు 24 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా, ఆ తర్వాత ఏడు సంవత్సరాల కాలం జూనియర్ కళాశాల ప్రధానాచార్యులుగా పని చేశారు. ఆగస్టు 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యుల ఆధ్వర్యంలో కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేస్తున్న నాగేశ్వరరావును, ఆయన సతీమణిని శనివారం సత్కరించారు. అభినందన సభతో పాటు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దంలో నాగేశ్వరరావు చేసిన కృషిని కొనియాడారు.


నాగేశ్వరరావు దంపతలును సత్కరిస్తున్న వక్తలు

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతి నెలా ఒకటో తేదీన సామాజిక పెన్షన్లు పంపిణీ జరగాల్సి ఉండగా ఆరోజు ఆదివారం అయినందున ఈ నెల 31వ తేదీన శనివారం ఉదయం ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆధ్వర్యంలో ఉదయం బిడి, ఎంఆర్‌సి కాలనీ (50 డివిజన్)లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి హాజరయ్యారు. నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు, నగర కమిషనర్, అధికారులతో పాటు జనసేన పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ వెంకటరత్నం, నెరసు గంగరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు పాల్గొన్నారు.

కుక్కునూరు : మండల కేంద్రమైన కుక్కునూరు గ్రామంలో టిడిపి మండలాధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఉప సర్పంచి పిచ్చుక రాజు, సచివాలయ సిబ్బంది, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, తెలుగు యువత అధ్యక్షులు అంగిరేకుల బాలాజీ, కుక్కునూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఐరలీమోహన్, గురజాల నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే 31వ తేదీనే పెన్షన్లు పంపిణీ చేయిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టిడిపి మండల నాయకులు దేవినేని డలరామ్ అన్నారు. శనివారం ఉదయం లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. గ్రామ సచివాలయసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫించన్ డబ్బులు అందించారు.

3,879 మందికి పింఛన్ల పంపిణీ

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా 4299 పెన్షన్లకు 3879 ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కెఆర్‌ఎస్.కృష్ణప్రసాద్ తెలిపారు. అయితే ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక్క రోజు ముందుగానే శనివారం పెన్షన్ల పంపిణీని చేపట్టినట్లు తెలిపారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులు, సచివాలయ సిబ్బంది పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారని చెప్పారు.

7,785 మందికి పెన్షన్ల పంపిణీ

టి.నరసాపురం : మండలంలో శనివారం 7785 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ బిఎస్-ఎల్.మంగాకుమారి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య, వికలాంగ, వితంతు ఇతర పెన్షన్లన్నీ సెప్టెంబర్ ఒకటో తేదీన పంపిణీ చేయాల్సి ఉండగా ఆరోజు ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా సచివాలయ సిబ్బందితో ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. మిగిలిన పెన్షన్లు సోమవారం పంపిణీ చేస్తారన్నారు. కాగా మండలంలోని ఆయా పంచాయతీలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు చేతులమీదుగా పెన్షన్లు పంపిణీ చేశారు. మండలంలోని తిరుమలదేవిపేటలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు తోట లక్ష్మీనారాయణ, కేతవరంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు.


ముసునూరులో...

చాట్రాయి : మండలంలోని చనుబండ, చిన్నంపేట, జనార్ధనవరం గ్రామాల్లో పెన్షన్లను పంపిణీ చేశారు. అధికారులు ఉదయమే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లను అందించారు. చనుబండ గ్రామంలో విస్సంపల్లి కుమార్‌రాజాకు డయాలసిస్ పెన్షన్ రూ.పది వేలు, చిన్నంపేటలో డయాలసిస్ వ్యాధిగ్రస్తుడు చెన్నారావుకు రూ.పది వేల పెన్షన్ అందించారు. జనార్ధనవరంలో అధికారులతో పాటు కూటమి నాయకుడు బలువురి రత్తయ్య పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మొరంపూడి సురేష్, మొరంపూడి రమేష్, నక్క రాము, చీదిరాల మరేశ్వరరావు పాల్గొన్నారు.

తడిచిన డివైజ్‌లతో ఇబ్బందులు

ఉంగుటూరు : ముందస్తు పింఛన్ల పంపిణీలో భాగంగా శనివారం పెన్షన్ల పంపిణీ సజావుగానే సాగినట్లు అధికారులు వెల్లడించారు. డివైజర్లు కొన్ని చోట్ల తడిచిపోవడం, లబ్ధిదారులు వానలో తడవడం వల్ల వేలిముద్రలు సరిగ్గా పడకపోవడం వల్ల కొన్ని గ్రామాల్లో మినహా మిగతా చోట్ల పింఛన్లు సొమ్ములు పంపిణీ చేసినట్లు పలువురు విఆర్‌ఒలు తెలిపారు.

CHANGE OF NAME

I. **ANNAPAREDDY RAJESWARI,** W\o **ANNAPAREDDY KARUN KUMAR REDDY,** Previously called **GUNTAKA RAJESWARI** (Old Name) Resident of D.No. 10-159\1, pedda Masidu Centre, Vuyyuru, Krishna District, Andhra Pradesh, Pin-521165. now changed my name from **GUNTAKA RAJESWARI** (Old Name) to **ANNAPAREDDY RAJESWARI** (New Name). Today onwards use my new name for all Further transactions.

CHANGE OF NAME

I. **ANNAPAREDDY KARUN KUMAR REDDY,** residing at D.No. 10-159\1, pedda Masidu Centre, Vuyyuru, Krishna District, Andhra Pradesh, Pin-521165. informs to the public that my spouse **GUNTAKA RAJESWARI** (Old Name) has officially Changed their name to **ANNAPAREDDY RAJESWARI** (New Name). all future references and Correspondence Should use the name **ANNAPAREDDY RAJESWARI** (New Name).

మహారాజ శ్రీ గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, కొత్తగూడెం
ఐ.పి. నెం. 11/2022

బిట్వీన్:
షేక్ ఖాదర్ వాలి ...వాది
మరియు:
మహమ్మద్ అబ్దుల్ సాహిద్ ...ప్రతివాది
To,
R-3: కరికాల వెంకట లక్ష్మి, C/o. నాగేశ్వర్ రావు, వృత్తి: ఫైనాన్స్ బిజినెస్,
R-4: కరికాల నాగలక్ష్మి, W/o. శ్రీనివాస రావు, వయస్సు: 35 సం//లు, వృత్తి: ఫైనాన్స్ బిజినెస్,
R-5: కరికాల శ్రీనివాస రావు, S/o. నాగేశ్వర్ రావు, వయస్సు: 40 సం//లు, వృత్తి: ఫైనాన్స్ బిజినెస్,
పై ముగ్గురి నివాసము: ఇంటి నెం. 23-183, పతే పేట, నూజివీడు, ఏలూరు జిల్లా.
R-6: షేక్ జహంగీర్, S/o. సర్దార్, వయస్సు: 48 సం//లు, వృత్తి: లారీ బిజినెస్,నివాసము: ఇంటి నెం. 237, ఎంప్లాయర్స్ కాలనీ, వీధి నెం. 922, నూజివీడు, ఏలూరు జిల్లా ...ప్రతివాదులు R3,R4,R5, R6.

నోటీస్

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! షేక్ ఖాదర్ వాలి అను వారు మీ పై వేసిన దివాళా దావా ఐ.పి.నెం. 11/2022, **ది: 17-09-2024 నాడు ఉ.గం॥ 10:30 ని॥ లకు** మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై సమాధానము ఇవ్వని యెడల కోర్టు వారు కేసు మీకు పరోక్షములో తీర్మానము చెయ్యగలరని తెలియజేయుచున్నాము.

// కోర్టు వారి ఆర్డర్ ననుసరించి//
ఎస్.వి. రమణారెడ్డి, పగిడిపల్లి రవి,
వాదితరపు న్యాయవాదులు,
కొత్తగూడెం, సెల్: 9440116 171.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PALAKOL
O.S.No.25/2019

Between:
Indian Bank, Nationalized bank owned by Government of India, having its central office at 68, Rajaji Salai, Chennai, Branch all over India and Its Branch Indian Bank, Microsate, Palakol Rep.by Chief Manager, D.V.S.S.Ramanjaneyulu Power of Attorney holder ...Plaintiff/వాది
And
Pasupuleti Revathi and others ...Defendants/ప్రతివాదులు

To
పసుపులేటి రేవతి (1వ ప్రతివాది)
W/o.ఇస్సాకు, డోరునెం. 42-2-52,
బేతలహంపేట, పాలకొల్లు.

పై నెంబరు దావా O.S.No.25/2019లో మీకు ఎన్నిసార్లు కోర్టు వారి ఉతర్వులు ద్వారా సమర్లు నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున I.A.No.602/2023గా కోర్టు వారి అనుమతిపొంది ఈ ప్రకటన ద్వారా పై నెంబరు దావాలో మీరు ది 9.9.2024 న వ్యక్తిగతం గాను లేదా ప్లీడరు గారి ద్వారాను ఉదయం 10.30 గ॥లకు హాజరు కావలసినదని లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించటమగునని కోర్టు వారి ఉతర్వులు ప్రకారం మీకు తెలియపరుచుచున్నాము. వాయిదా తేదీ 09-09-2024 సమయం ఉదయం 10-30

దశిక శేషగిరిరావు
పాలకొల్లు అడ్వకేటు, పాలకొల్లు
తేది. 31-8-2024 Cell. 9492918848

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు దివ్య సముఖమునకు
I.P.No.9/2024

Between:
యాతం దుర్గ మరియు మరొకరు ...పిటిషనర్లు
మరియు
ఆకుల శ్రీను మరియు వగైరా ...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటిషనులో నా క్లయింట్లు యాతం దుర్గ మరియు యాతం సాయి గీతలు, ఆకుల శ్రీను వగైరాలపై రుణ ఎగవేత పిటిషనున్న ది. 29.4.2024 తేదీన దాఖలు చేయగా శ్రీకోర్టు వారి ద్వారా అనేక పర్యాయములు నోటీసు అమలు నిమిత్తమై రిజిష్టర్డు పోస్టు ద్వారా మరియు కోర్టు ద్వారా అనేక పర్యాయములు సమను పంపినప్పటికిన్నీ మీరు తీసుకోనందున శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం సబ్‌స్టిట్యూట్ సర్వీసు నిమిత్తమై శ్రీకోర్టు వారు ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు వాయిదా తేదీని తెలియ పరచమని ఆర్డర్ వేసియున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా మేము మద్దాల వెంకటరత్నం అను మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటిషను I.P.No.9/2024 మీ యొక్క హాజరు నిమిత్తమై ది. 19-09-2024 తేదీనకు వాయిదా కలదు. కావున సదరు తేదీన మీరు స్వయముగా కానీ లేక వకీలు ద్వారా కానీ ఉదయం 10.30 గంటలకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

Palepu Venkata Satyanarayana
తాడేపల్లిగూడెం Advocate, Tadepalligudem
తేది. 31-08-2024 Cell: 9963346059